# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

*We are all apprentices in a craft, where no one ever becomes a master*

- ***ERNEST HEMMING WAY***

ఆంధ్రపత్రిక

# 4

**నేను రచయిత అయ్యాక చూసిన రెండవ** పత్రికా కార్యాలయం విజయవాడ గాంధీనగర్ లోని ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక కార్యాలయం. విజయవాడ నా స్వగ్రామం. విజయవాడ నుంచి ఉద్యోగరీత్యా హైదరాబాద్ వచ్చాక, నేను అనేకసార్లు విజయవాడ వెళుతుండేవాడిని. విజయవాడలోని మా ఇల్లు కూడా గాంధీనగర్ లోనే ఉండేది. మా ఇంటినుంచి ఐదు నిముషాల నడక దూరంలో ఆంధ్రపత్రిక కార్యాలయం ఉండేది. ఆంధ్ర పత్రికలో నేను రాసిన కథ మొదటగా ఆగస్ట్ 6, 1971 సంచికలో ప్రచురించబడింది. దాని పేరు 'పిరికివాడు' యం. మాధవరావు అనే వారి సంతకంతో దాన్ని ప్రచురిస్తున్నట్లు పత్రిక కార్యాలయం నుంచి నాకు ఓ కార్డు అందింది.




ఆ తర్వాత విజయవాడ వెళ్ళినప్పుడు ఓ సారి ఆంధ్రపత్రిక కార్యాలయానికి వెళ్ళాను. తెల్లటి బిల్డింగ్‌లోని ముందు రిసెప్షన్ గదిలోంచి లోపలికి వెళితే ఆ వెనక గదిలో కుడివైపు పది బై పది అడుగుల పార్టిషన్ లో ఎడిటర్ శ్రీ వీరాజీ కూర్చునేవారు. బయట గుమ్మం ఎదురుగా బల్ల ముందు సబ్ ఎడిటర్ మాధవరావుగారు కూర్చునున్నారు. ఆయన్ని పలకరించి నా పేరు చెప్పి, నా కథలు 'కాటేసాడు, కోటివిద్యలు.' పెండింగ్ లో ఉన్నాయని, వాటి గురించి కనుక్కోడానికి వచ్చానని చెప్పాను. తన పేరు మాధవరావని, తను సబ్ ఎడిటర్ గా పనిచేస్తున్నానని ఆయన చెప్పారు. అప్పట్లో ఆయనకి 30 - 35 ఏళ్ళుండేవి. అప్పుడే నిద్రలేచినట్లుగా ఉండేది ఆయన మొహం. లోపల ఎడిటర్ వీరాజీగారున్నారని, వారిని కలవమని, ఆ రెండు కథలు చదివి తను ఎంపిక చేశానని, ఎడిటర్‌దే ఆఖరి నిర్ణయం అని చెప్పారు.

కేబిన్ లోని వీరాజీగారి దగ్గరకి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. కూర్చోమని సాదరంగా మాట్లాడారు. ఆయనే ఎక్కువ మాట్లాడతారు తప్ప ఎదుటివారిని పెద్దగా మాట్లాడనివ్వని లక్షణం ఆయనలో గమనించాను. ఆయన నుదుట ఎప్పుడూ బొట్టుండేది. అప్పట్లో వారి వయసు నలభై దాకా ఉండచ్చు. తను పత్రికలో రాసే కాలం 'సామాన్యుడి సణుగుడు' గురించి మాట్లాడారు. వీరాజీ అక్షరాల్లో ప్రతీవారం ఓ అక్షరం తీసేసి ఆ స్థానంలో స్టార్ పెట్టేవారు. *రాజీ, వీ*జీ, వీరా * ఇలా....

'కాటేసాడు' చదివానని, బావుందని చెప్పారు. ఇంకో కథ ఇంకా చదవలేదాయన.

ఆ తర్వాత చాలాసార్లు శ్రీ వీరాజీని విజయవాడ వెళ్ళినప్పుడు కలిసేవాడిని. ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుని మాట్లాడేవారు. ఆయన నాతో ఓసారి అన్నమాటలు నాకు బాగా గుర్తు. అప్పటికే నా రచనలు విరివిగా అన్ని పత్రికల్లో వస్తుండేవి. ఆ విషయం గురించి మాట్లాడుతూ చెప్పారు "రైటర్ గా ఎవరూ ఎక్కువ కాలం రాయలేరు. కొంతకాలానికి ఎగ్జాస్ట్ అయిపోతారు".

నాకు ఆయన కోణం అర్థంకాలేదు. కథలకి ఐడియాలు వస్తూంటే, ఎందుకు ఎగ్జాస్ట్ అవాలి? అనిపించింది కాని, బయటకి ఆ విషయం చెప్పలేదు. ఆయన ఎక్కువగా తను రాసిన వాటి గురించి చెప్పేవారు. అప్పటికే ఆయన సీరియల్స్ రాసారు. ఓసారి ఆయన నాతో చెప్పారు.

"నేను రాసిన ఓ కథ ఆధారంగా యద్దనపూడి సులోచనారాణి నవలగా వచ్చింది"

కాని సులోచనా రాణి గారి నవలకి అది ప్రేరణ అయి ఉండకపోవచ్చు.

శ్రీ వీరాజీని నాలా చాలా మంది రచయితలు కలుస్తుండేవారు. శ్రీ ప్రతాప రవిశంకర్, శ్రీ వేదగిరి రాంబాబు వారిని ఎక్కువగా కలుస్తూండేవారని చెప్పారు. తనని రిక్షాలో తన ఇంటికి చాలాసార్లు వీరాజీగారిని రవి శంకర్ తీసుకెళ్ళారని చెప్పారు.

కొంతకాలానికి శ్రీ వీరాజీ రిటైరైపోయారు. ఆ స్థానంలో శ్రీ మతుకుమల్లి మాధవరావు ఎడిటర్‌గా వచ్చారు.

శ్రీ వీరాజీ అప్పట్లో సత్యనారాయణపురంలో ఉండేవారు. ఆయన రిటైరైపోయాక మళ్ళీ నేను ఆయన్ని కలిసే అవకాశం రాలేదు.

శ్రీ వీరాజీ గురించి రచయిత వేదగిరి రాంబాబు ఇలా చెప్పారు.

"వీరాజీ కలం పేరు. ఆయన అసలు పేరు పిళ్ళా కృష్ణమూర్తి. పంతొమ్మిదొవ ఏటనుంచే జర్నలిస్ట్ జీవితంలోకి వచ్చారు. వీరి నవల 'విడీవిడని చిక్కులు' పత్రికలో సీరియల్‌గా వచ్చింది. ఎమెస్కో వారు దీన్ని పుస్తకంగా వేసారు. రిటైరయ్యాక శ్రీ వీరాజీ కొంతకాలం కృష్ణాపత్రికలో ఎడిటర్‌గా పనిచేసారు. ఆంధ్రభూమి డెయిలీకి విజయవాడ విశేషాలు శీర్షికతో ఓ కాలం రాసేవారు. వారి పెద్దబ్బాయి దగ్గరకి హైదరాబాద్ వచ్చేసారు. ఇప్పుడాయన మరో శీర్షికని ఆంధ్రభూమికి రాస్తున్నారు. రచయితగా నన్ను వారు చాలా ప్రోత్సహించారు. ఆ కృతజ్ఞతతో దాదాపు 40 కథలు గల వీరాజీగారి కథల సంపుటిని వెలువరించాను."

కొన్ని సంవత్సరాల తర్వాత ఆంధ్రపత్రిక కార్యాలయం కింద నుంచి మేడమీదకి మార్చపడింది. తిరుగుడు (స్పైరల్) చెక్క మెట్లు ఎక్కుతూ పైకి వెళితే ఎడిటోరియల్ గది ఉండేది. వాటి మీద నడుస్తూంటే చప్పుడయ్యేది. శ్రీ మాధవరావుగారు నన్ను 1980లలో ఓసారి సీరియల్ రాయమని అడిగారు. అప్పటికే ఆంధ్రభూమిలో నవలా యుగం మొదలైంది. స్వాతి వీక్లీలో కూడా నా నవలలు సీరియల్స్‌గా రాసాగాయి. స్వాతి వీక్లీ అప్పట్లో ఆంధ్రపత్రిక ప్రెస్ లోనే అచ్చయ్యేది. ప్రింటయిన ఫారాల్లోని నా సీరియల్‌ని చదివి ఇంప్రెస్ అయిన మాధవరావుగారు పత్రికలో నా సీరియల్ వేయాలని సంకల్పించారు. దాన్ని మేనేజింగ్ ఎడిటర్ శ్రీ శివలెంక రాధాకృష్ణకి చెప్పి ఒప్పించారు. ఆ సందర్భంగా నన్ను ఆయన దగ్గరకి తీసుకెళ్ళారు. రాధాకృష్ణగారు సీరియల్ గురించి తప్ప మిగిలిన విషయాలు మాట్లాడారు. మంచి గుడివిల్ గల, ఓల్డెస్ట్ వీక్లీని నడుపుతున్నాననే గర్వం ఆయన మాటల్లో తొణికిసలాడింది. ఆయన ఎవరిమాట వినరనే అభిప్రాయం చాలామంది వ్యక్తం చేసారు.

'వినాయకరావు పెళ్ళి' అనే హాస్య సీరియల్ ఆంధ్రపత్రికలో రాసాను. అప్పట్లో దినపత్రిక ఆఫీస్ బ్రాంచ్ హైదరాబాద్‌లో దోమల్ గూడాలో ఉండేది. వ్రాతప్రతిని ఆ ఆఫీస్‌లో ఇస్తే విజయవాడ కార్యాలయానికి వారు పంపేవారు. నాకు సరిగ్గా తెలీదు కాని, పత్రికని మూసేయడానికి ఛీఫ్ మినిస్టర్ ఎన్.టి.ఆర్ కారణమన్న వదంతిని కూడా విన్నాను. చివరికి పత్రిక మూతపడింది.

దురదృష్టం ఏమిటంటే గూగుల్, బింగ్‌లలో సెర్చ్ చేస్తే ఆంధ్రపత్రిక కవర్ పేజి ఇమేజ్, అపన ఇమేజ్ లూ దొరకలేదు. వీరాజీ, ఆంధ్రపత్రిక, అని సెర్చ్ చేస్తే వారి ఫోటో కూడా దొరక్కపోవడం దురదృష్టకరం. శ్రీ వీరాజీ ఎంతో మంది యువ రచయితలకి రచనలు ఎలా చేయాలో ముఖాముఖి సలహాలు ఇస్తుండేవారు. ఆయనవల్ల ఎందరో రచయితలు తయారయ్యారు ఆయన తెలుగు అని కాక తెనుగు అని రాసేవారు. అదే కరక్టని చెప్పేవారు.

ఆంధ్రపత్రిక మూసేసాక శ్రీ మాధవరావుని శివలెంక రాధాకృష్ణగారి మరో సంస్థ అమృతాంజనం లిమిటెడ్‌లో ఉద్యోగిగా తీసుకున్నారు. రాధాకృష్ణగారికి వీరాజీగారి కన్నా మాధవరావుగారంటే ఎక్కువ ఇష్టం. దాదాపు పదిహేనేళ్ళ క్రితం ఓసారి శ్రీ మాధవరావు నాకు ఫోన్ చేస్తే, నారాయణ గూడాలోని తాజ్ మహల్ హోటల్ లోని వారి గదికి వెళ్ళి కలిసాను. తను అమృతాంజనం కంపెనీ ఉద్యోగినని, ఆ కంపెనీ పని మీదనే వచ్చానని, రాధాకృష్ణగారు మరో వారపత్రికని మద్రాస్ నుంచి, తన పేరు గుప్తంగా ఉంచి ఆరంభిస్తున్నారని, దానికి సీరియల్ కావాలని కోరారు. ఆ పత్రిక పేరు ప్రియదత్త.

నేను 'నిన్నటి పున్నమి' అనే సీరియల్‌ని 2000 సంవత్సరంలో అందులో రాసాను. ముందు అనుకున్న పారితోషికంలో సగం మాత్రమే ఇచ్చి, బాలన్స్ పంపలేదు. బహుశా అది నష్టాల్లో ఉండి ఉంటుంది. ఆ పత్రిక ఆ తర్వాత కొంతకాలం 2004 దాకా అనుకుంటా వచ్చి ఆగిపోయింది. శ్రీ మాధవరావు మొదట్లో ఆంధ్రపత్రిక పత్రిక ఉద్యోగిగా మద్రాస్ లోనే చేరారు. పత్రిక కార్యాలయం

విజయవాడకి షిఫ్ట్ అయ్యాక విజయవాడ వచ్చేసారు. తిరిగి మద్రాస్ వెళ్ళారు. ఇప్పుడు వారు మంగళగిరిలో ఉంటున్నారని ప్రతాప రవిశంకర్ చెప్పారు.

❁ ❁ ❁

ఏ పత్రిక నుంచయినా నేను పంపిన కథని అంగీకరించామని ఉత్తరం వచ్చాక వెంటనే ఇంకో కథని పంపేవాడిని. అది పంపిన కొద్దివారాలకి, అవకాశం ఉంటే వెళ్ళి ఆ కథ గురించి అడిగి తెలుసుకునేవాడిని. చాలామంది కొత్త రచయితలు చేసే పనే ఇది.




అప్పట్లో 'తరుణ' అనే మాసపత్రిక హైదరాబాదులోని మలక్ పేటనుంచి వెలవడేది. దాని యజమాని, సంపాదకుడు శ్రీ బాసాని సుదర్శన్ రెడ్డి. నేను పంపిన కథలలో ఏవీ తిప్పిపంపకుండా ఆయన వేసుకున్నారు. ఓసారి వారిని తరుణ ఆఫీస్‌కి వెళ్ళి కలిసాను. రచయితల, రచయిత్రుల ఫోటోలని తరుణ ముఖచిత్రంగా వేసేవారు. నా ఫోటో అడిగారు కాని నేను నిరాకరించాను. నవలిక కోరితే 'మిస్టర్ సంపత్' రాసిస్తే వేసారు. గ్రాడ్యుయేట్, విముక్తి అనే మరో రెండు నవలికలు కూడా తరుణలో వచ్చాయి.

తెలంగాణా యాసతో మాట్లాడే శ్రీ బాసాని సుదర్శనరెడ్డి వయస్సు 40 - 45 మధ్యలో ఉండేది. నల్లగా, బలంగా ఉండేవారు. కొద్దికాలానికి 'తరుణ'ని మూసేసారు. నా సీరియల్ ప్రకటించారు కాని ఆర్థిక ఇబ్బందుల వల్ల మూసేసారు. ఆయన ఓ నెలకి ప్రకటనల నుంచి ఎంత మొత్తం రావాలో అంతా వస్తేనే పత్రికని రిలీజ్ చేసేవారు. లేదా ఆ నెల పత్రికని తెచ్చేవారు కారు. ఆయన ప్రకటనలు సేకరించడానికి స్వయంగా వెళ్తూండేవారు.

ఆ తర్వాత శ్రీ బాసాని మళ్ళీ ఎన్నడూ తారసపడలేదు. వారి గురించి తెలీదు.

❁ ❁ ❁




స్వాతి మాసపత్రిక ఆఫీస్, ఆ రోజుల్లో, హైదరాబాద్‌లో విఠల్‌వాడి, షాలిమార్ థియేటర్ల ప్రాంతంలో ఉండేది స్వాతికి పంపిన కథ గురించి 3,4 నెలలైనా ఏమీ తెలియలేదు. నేను ప్రతీ కథకి విధిగా స్వంత చిరునామా గల కవర్‌ని జత చేసేవాడిని. అది తిరిగి రాకపోవడంతో, ఓ శనివారం స్వాతి కార్యాలయానికి వెతుక్కుంటూ వెళ్ళాను. అది లంచ్ అవర్. ఒకాయన కూర్చుని ఉన్నారు. వారికి నన్ను నేను పరిచయం చేసుకుని నా కథ గురించి అడిగాను. ఆ కథ చదివానని, బావుందని, వేస్తున్నామని.. చెప్పారు.

" మీ శైలి చాలా బావుంది." ఆయన చెప్పారు.

లంచ్ ముగించుకుని ఆ గదిలోకి వచ్చిన మరో వ్యక్తి నాతో చెప్పారు.

"ఆయన సాధారణంగా ఎవరి శైలిని మెచ్చుకోరు."

ఈ మాటలన్న వ్యక్తి శ్రీ వేమూరి సత్యనారాయణ. అయితే నాకు ఆ సమయంలో ఆయన పేరు తెలియదు. తర్వాత శ్రీ వేమూరి ఆ సంఘటనని గుర్తు చేసి చెప్పారు. నా శైలి మెచ్చుకున్నాయన పేరు శ్రీ శీలా వీర్రాజు.

ఆ తర్వాతమళ్ళీ స్వాతి కార్యాలయానికి వెళ్ళలేదు. తర్వాత అందులోని భాగస్తుడైన శ్రీ వేమూరి బలరాం దాన్ని కొని విజయవాడకి కార్యాలయాన్ని బదిలీ చేసారు. విజయవాడలో గవర్నర్ పేటలో బీసెంట్ రోడ్ సమీపంలోని స్వాతి మంత్లీ కార్యాలయానికి అనేకసార్లు వెళ్ళాను.

❁❁❁

ఆంధ్రప్రభ వీక్లీలో నా కథలు చాలా వచ్చేవి. కాని ఓ సారి ప్రచురింపబడ్డ ఓ కథకి నాకు చెక్ రాలేదు. కథ ప్రచురించబడిన వీక్లీ వెలువడ్డ సరిగ్గా నెలా పదిహేనురోజులకి చెక్ వచ్చేది. కొంతకాలం చూసి ఆంధ్రప్రభ ఎడిటర్‌కి అందలేదని ఉత్తరం రాసాను. ఇంగ్లీషులో టైప్డ్ లెటర్ ఎడిటర్ నుంచి వచ్చింది, అకౌంట్స్ వాళ్ళు చెక్ పోస్ట్ చేసామని చెప్పారని, స్టాప్ పేమెంట్ ఆర్డర్ ఇచ్చి డూప్లికేట్ చెక్‌ని పంపుతామని. కాని వారినుంచి ఆ డూప్లికేట్ చెక్ రాలేదు. తర్వాత వేసిన కథలకి మాత్రం చెక్‌లు వచ్చాయి.

1974 లో ఓ బంధువు పెళ్ళికి హాజరవడానికి మద్రాస్ వెళ్ళినప్పుడు మౌంట్ రోడ్‌లోని ఆంధ్రప్రభ కార్యాలయాన్ని వెతుక్కుంటూ వెళ్ళాను. అది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్‌లో ఉంది. ఆ పెద్ద కాంపౌండ్‌లోకి వెళ్ళడానికి బయట యూనిఫాం లోని వాచ్‌మెన్ గేట్ పాస్ రాసిచ్చారు. ఓ బిల్డింగ్ లోని మేడమీద ఆంధ్రప్రభ కార్యాలయం ఉంది. డూప్లికేట్ చెక్ పంపుతానన్న ఆయన రాసిన ఉత్తరం చూపిస్తే బయట ఉన్నవారు ఎడిటర్ కేబిన్ లోకి వెళ్ళి మాట్లాడమని చెప్పారు. అదికూడా ఆంధ్రపత్రిక వీరాజీగారి కేబిన్‌లా చిన్నది. దాదాపు అలాగే ఉంది.

లోపల ఉన్న ఓ ముసలాయనకి నన్ను నేను పరిచయం చేసుకుని వచ్చిన పని చెపుతూ ఆ ఉత్తరం ఇచ్చాను. అంతదాకా రచయితగా నేను కలసిన ప్రతీ ఎడిటర్ సాదరంగానే మాట్లాడటం నాకు అనుభవం. కాని ప్రభ ఎడిటరైన శ్రీవిద్వాన్ విశ్వం మొహంలో చిరునవ్వు లేదు. దాన్ని చిరాగ్గా చూసి ఏక్షన్ తీసుకుంటానని చెప్పారు. నేను నిమిషం మించి ఆయనగదిలో లేను. సెలవు తీసుకుని బయటకి వచ్చేసాను. అప్పటికే అద్దెకిచ్చిన హృదయాలు, మిసెస్ పరాంకుశం అనే రెండు నవలికలని సీరియల్‌గా ప్రచురించినా వాటి రచయితగా నన్ను ఆయన గుర్తుపట్టినట్లుగా లేరు.

ఈ రోజుకీ ప్రభనుంచి నాకు ఆ ఏభైరూపాయలు రాలేదు.

❁❁❁

1978 ప్రాంతంలో శ్రీ విజయబాపినీడు ఓ కొత్త మంత్లీని ఆరంభించాలనుకున్నారు. దానికి నా సహాయం కోరి నన్ను మద్రాస్ పిలిపించారు. దాని సైజు, పేరు అప్పటికే ఆయన నిర్ణయించారు. అది 'నీలిమ' మాసపత్రిక. నేను సెలవు పెట్టినన్ని రోజులూ, నాకు జీతం ఎంత వస్తుందో అంత మొత్తం నా పనికి ప్రతిఫలంగా ఇచ్చారు.

శ్రీ విజయబాపినీడు నల్లగా పొట్టిగా ఉండేవారు. అప్పటికి 45 పైనే ఉంటుంది వయసు. ఫక్తు వ్యాపారవేత్త, వర్క్ హాలిక్. ధనలక్ష్మీ కాలనీలో వారి ఇల్లు కింద, ఆఫీస్ పైన ఉండేవి. అశోక్ నగర్‌లో వారి సినిమా గెస్ట్ హౌస్ ఉండేది. అందులో ఉండేవాడిని. ఓ ప్రొడక్షన్ అసిస్టెంట్, నన్ను బస్‌లో ఆయన ఆఫీస్‌కి తీసుకెళ్ళి, మళ్ళీ రాత్రికి తీసుకొచ్చేవాడు. పాండీ బజార్‌లోని ఓ హోటల్‌లో భోజనం పెట్టించేవారు. శ్రీ బాపినీడే స్వయంగా ప్రతీ రచన చదివేవారు. రచయితలతో తనే ఉత్తరప్రత్యుత్తరాలు జరిపేవారు. ఓ రోజు మాటల్లో నేను వారితో అన్నాను.

"ఈ మొత్తం బాధ్యతని మీరు ఎవరికైనా అప్పచెప్పవచ్చు కదా? అంతా మీరే ఎందుకు చూసుకోవడం? ఆ సమయం మీరు సినిమా వ్యాపారానికి కేటాయించవచ్చుకదా?"

"ఎడిటర్ ప్రతిభావంతుడైతే అతను నాతో ఉన్నంత కాలం సర్క్యులేషన్ నిలుస్తుంది. ఏ కారణం చేతయినా అతను వెళ్ళిపోతే మళ్ళీ మొదటి కొస్తుంది. ఇందువలన పత్రిక మీద నాకు కంట్రోల్ ఉండదు."

ఒక్క రామోజీరావుగారు మాత్రమే ఈ విషయంలో విజయవంతమైన సంపాదకుడు. ఆయన స్వయంగా దేనికీ సంపాదకత్వం వహించక పోయినా, ఆయన సంస్థనుంచి మంచి పత్రికలు, కొన్ని లార్జెస్ట్ స ర్క్యులేటెడ్వి ఉన్నాయి. ఆయనలా బాధ్యతలని సరైన వ్యక్తికి అప్పగించి, సూపర్ వైజ్ చేస్తూ చేయించి విజయవంతం అవడం నాకు తెలిసీ మరే పత్రికా యజమానికీ తెలీదు. బలహీన సంపాదకులు ఉద్యోగస్తులుగా పని చేసే  సంస్థలు ఎన్నో నాకు తెలుసు. అసలు తమ పత్రికలో ఏమొస్తోందో కూడా తెలీకుండా పత్రికలు నడిపే వ్యాపారస్తులూ నాకు తెలుసు. ఒక్క శ్రీ రామోజీరావే తెలుగులో ఇందుకు మినహాయింపు.

ఈ కారణంగానే సినిమాలో బిజీ అయాక విజయవంతంగా నడిచే 'విజయ' మంత్లీని బాపినీడుగారు స్వయంగా చూసే సమయం లేక మూసేసారు.

విజయ మంత్లీలో ఓ గమ్మత్తయిన ప్రక్రియని బాపినీడు ప్రవేశపెట్టారు. కథావిభాగం, సినిమా సెక్షన్, నవలిక, హాస్యం నాలుగు విడి పుస్తకాలుగా ముద్రించి, ఆ నాలుగు కలిపి అతికించి తెచ్చారు - ఏకకాలంలో నలుగురు ఈ పత్రికని చదువుకోవచ్చు అన్న కాన్సెప్ట్ పాఠకులని బాగా ఆకర్షించింది. ఆనాటి రచయితల చిరునామాలన్ని సేకరించి, శ్రీ బాపినీడు నెలనెలా వారందరికీ కాంప్లిమెంటరీ కాపీలని ఉచితంగా పంపేవారు. ఇలాంటి గౌరవం అంతదాకా ఎరగని రచయితలు విజయకి ఉత్సాహంగా రాసేవారు. ఆ విధంగా 'విజయ'లో మంచి కథలు వచ్చేవి. పారితోషికం తప్పనిసరిగా పంపేవారు. రచయితలతో శ్రీ బాపినీడు వ్యక్తిగతంగా తనే రాస్తూ ఉత్తరప్రత్యుత్తరాలు నిర్వహించేవారు.

నాకు గుర్తున్న ఓ విషయమిది. రంగనాయకమ్మ బాపినీడుగారికి, తనకి కాంప్లిమెంటరీ కాపీని పంపడాన్ని నిరసిస్తూ ఓ ఉత్తరం రాసారు. దాన్ని 'విజయ'లో వేసారో లేదో గుర్తులేదు. రమణ అనే జర్నలిస్ట్ 'విజయ'కి వర్కింగ్ ఎడిటర్ గా ఉండేవారు. శ్రీ బాపినీడు 'బొమ్మరిల్లు' అనే పిల్లల పత్రికని కూడా చందమామ ఇన్స్పిరేషన్తో తెచ్చేవారు. తెలుగులోనే కాక, హిందీ, తమిళం, కన్నడ మరికొన్ని భాషల్లో కూడా తెచ్చేవారు. 'బొమ్మరిల్లు'కి కూడా నేను చాలా కథలు రాసాను. 'బొమ్మరిల్లు' మేనేజర్గా బాపినీడుగారి మరదలు మామగారు శ్రీ కొసరాజు సుబ్బారావు పనిచేసేవారు. వీరు నేనంటే చాలా ఆప్యాయంగా ఉండేవారు. వీరు జ్యోతి మంత్లీ అధినేత్రి శ్రీమతి లీలావతీ రాఘవయ్యగారికి సోదరుడు. వీరబ్బాయి శ్రీరవి లీలావతి గారి కూతురు డాక్టరు శాంతిని వివాహం చేసుకున్నారు. వీరి ఇంకో అబ్బాయి, రవి అన్నయ్య శ్రీ కొసరాజు రాజా కూడా మేగజైన్ ప్రొడక్షన్ వ్యవహారాలు చూసేవారు. రాజా చాలా మంచి వ్యక్తి. శ్రీ బాపినీడులా లాభాపేక్ష మాత్రమే గల వ్యక్తికాదు. నేనతన్ని ఎంతో అభిమానించేవాడిని. తర్వాత అతను 'రివాల్వర్' అనే మంత్లీని అపరాధ పరిశోధన స్ఫూర్తితో ఆరంభించారు. దాంట్లో నేను 'నంబర్ పదకొండు' అనే సీరియల్ని, శ్రీ కొమ్మూరి సాంబశివరావు గూఢచారి నంబర్ నవలల స్ఫూర్తితో రాసాను. ఐతే ఆ పత్రిక నాలుగైదు సంచికలు వెలువడ్డాక ఆగిపోయింది.

❁ ❁ ❁

(క్రిందటి నెలలో మల్లాది గారు అపరాధ పరిశోధన పత్రిక సంపాదకలు శ్రీ శ్యామ్ దామోదర్ రెడ్డి గురించి వ్రాసిన వ్యాసం పాఠకులకు గుర్తుండే వుంటుంది. (*మళ్ళీ చదవడానికి ఇక్కడ క్లిక్ చెయ్యండి.*) అదే అంశం మీద అప్పటి ప్రఖ్యాత డిటెక్టివ్ నవలా రచయిత శ్యాంబాబు గారి స్పందన)

శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తి గారికి,

నమస్తే! మీకు ప్రామిస్ చేసిన విధంగా ఇన్ టైములో శ్రీ దామోదర రెడ్డిగారి గురించి నా అభిప్రాయాలు, పరిచయాలు ఏదైనా కానివ్వండి... వ్రాసిపంపడం ఆలశ్యమైనందుకు క్షంతవ్యుణ్ణి. మీకు పంపడం కోసం వ్రాసిన మొదటి మూడు పేజీలు, కొన్ని అవాంతరాలు,

వ్యక్తిగత కారణాలవల్ల వ్రాసిన వెంటనే పంపలేకపోయాను. జూలై '10 కౌముది ఇష్యూ చూశాక నేను ఇచ్చే మెటీరియల్ ఉపయోగం అంతగా లేదనిపించింది. అయినా మరికొన్ని విషయాలు గుర్తొచ్చి అవికూడా వ్రాసి పంపిస్తున్నాను. మీ ఆర్టికల్ కు ఉపయోగపడితే సంతోషం. దాదాపు 30-40 సంవత్సరాల క్రితం విషయాలు జ్ఞాపకం ఉంచుకుని ఒక క్రమంలో వ్రాయడం నాలాంటి వాళ్ళకి కొద్దిగా కష్టమే. వ్రాసినవన్నీ ఇంప్రెషన్స్ అనుకున్నా నేను విభేదించను. ఇన్నేళ్ళ తర్వాత కొన్నింటికి ఋజువులు, సాక్ష్యాలు ఉండవు. అప్పట్లో ప్రళయంలా అనిపించిన విషయాలు, ఈరోజు చాలా చిన్నవిగా అప్రాధాన్యంగా కనిపిస్తాయి. టెలిఫోన్ సంభాషణలో స్పష్టంగా, వెంటనే పాతవిషయాలు జ్ఞప్తికి తెచ్చుకోవడం కష్టమని, వ్రాసి పంపిస్తానని చెప్పాను. అంతకు మించి వేరే కారణం ఏమీ లేదు.

మంచి డిటెక్టివ్ కథారచయితగా ఇప్పటికీ అనేకమంది పాతతరం పాఠకులు నన్ను గుర్తుంచుకోగలుగు తున్నారంటే అందుకు కారణం కేవలం 'అపరాధ', దాని సంపాదకులు శ్రీ శ్యామ్ దామోదర్ రెడ్డి ఇచ్చిన ప్రోత్సాహమేనని నేనెప్పుడూ మరిచిపోను. 'అపరాధ' లో ఆయన నాతో వ్రాయించిన నా సీరియల్ 'కైలాస నగరం' నాకు రచయితగా మంచి పేరు తెచ్చిపెట్టింది. 'మయదారి లోకం' తొలి సీరియల్. కాని 'కైలాస నగరం' నా తొలిసీరియల్ అని చాలామంది అంటూ ఉంటారు. దాన్ని 'మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్, విజయవాడ' వారు తర్వత క్రేప్ ఎడిషన్ గా అనేక ముద్రణలు వేశారు. ఆ నవలను అప్పుడు శ్రీ దామోదర రెడ్డి గారికే అంకితం ఇచ్చాను. ఒక కాపీ ఆయనకు పంపినప్పుడు వెంటనే కృతజ్ఞతలు తెలుపుతూ ఉత్తరం వ్రాశారు. అలాగే 'అపరాధ' సప్లిమెంట్ లో కూడా అనేక చిన్న నవలలు ప్రచురించబడ్డాయి. వాటిలో కొన్నింటిని కొంత డెవలప్ చేసి తర్వాత కాలంలో 200 పేజీల నవలలుగా ప్రచురించడం జరిగింది.

మీ రచనా ప్రస్థానం మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని, అందుకు తగిన ఆయురారోగ్యాలు, మోటివేషన్ భగవంతుడు మీకు ప్రసాదించాలని కోరుకుంటూ

మీ

*శ్యామ్‌బాబు*

*13 జూలై 2010*

# శ్రీ శ్యామ దామోదర రెడ్డితో నాకున్న పరిచయం

## - శ్యాంబాబు

'అపరాధ పరిశోధన' మాసపత్రిక సంపాదకులు శ్రీ శ్యామ దామోదర రెడ్డితో నా సంబంధాలు ఎప్పుడూ స్నేహపూర్వకంగానే ఉండేవి. ఆయన్ను మొదటిసారి కలిసినప్పటినుండి, తర్వాత దాదాపు పన్నెండు సంవత్సరాలు... మా పరిచయం కేవలం సంపాదకుడు - రచయిత మధ్య ఉండే ఫార్మల్ రిలేషన్ షిప్‌లా కాకుండా, పరస్పర గౌరవంతో కూడిన స్నేహంగా ఉండేది.

శ్రీ దామోదర్ రెడ్డిని 1972లో మొదటిసారి కలిసాను. అప్పటికి అపరాధలో నేను వ్రాసిన కథలు మూడు మాత్రం ప్రచురింపబడ్డాయి. నారాయణగూడ వై.ఎం.సి.ఎ లో ఉంటున్న ఓ మిత్రుణ్ణి కలవటానికి వెళ్ళి, ఆ ప్రక్క బిల్డింగ్ లోనే 'అపరాధ' ఆఫీస్ అని తెలియడంతో, యాధృచ్చికంగా ఆ మిత్రుడితో కలిసి లోపలికి వెళ్ళాను. తర్వాత తెలిసింది, అది అపరాధ ఆఫీస్ కం రెడ్డిగారి రెసిడెన్స్ అని.

నన్ను నేను పరిచయం చేసుకోగానే చాలా సాదరంగా, ఆప్యాయంగా ఆహ్వానించారు. (ఫస్ట్ ఇంప్రెషన్ బెస్ట్ ఇంప్రెషనేమో!) పిచ్చాపాటి చాలాసేపు మాట్లాడుకున్నాం. నా వ్యక్తిగత విషయాలు, ఉద్యోగం వగైరా గురించి అడిగి తెలుసుకున్నారు. అపన ప్రచురణ, డిస్పాచ్, నిరహణ గురించి చాలా విషయాలు చెప్పారు. కేవలం ఒక ఆఫీస్ బాయ్ సహాయంతో పత్రిక నిర్వహణ అంతా తానే చేస్తున్నారని తెలిసి నిజంగానే ఇంప్రెస్ అయ్యాను. అప్పటి వరకు మూడుకథల ప్రచురణతో ఉన్న ఇన్‌డైరెక్ట్ ఇంపాక్ట్ చాలా మారింది. అపనలో నా మొదటి కథ 'ఆటీన్ రాణి - డైమండ్ నెక్లెస్' కార్డ్ రావడం, ఆ తర్వాత రెండు వారాలకు పోస్ట్‌లో కథ ప్రచురింపబడిన 'కాపీ' రావడం, మరో రెండురోజులకు 30 రూ ఎం.వో రావడం ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది. నిజానికి అప్పటికే చాలా పత్రికల్లో అప్పుడప్పుడూ నా కథలు ప్రచురింపబడి ఉండడం వల్ల, కథ అచ్చులో 'తొలిసారి' చూసిన థ్రిల్ కాదు కాని, 100% డిటెక్టివ్ కథ ప్రచురింపబడడం వలన కలిగిన ఫీలింగ్ అనుకుంటాను. చాలా సిస్టమాటిక్ పత్రిక అనిపించింది. ఆ తర్వాత రెండు కథలకూ అదే పద్ధతి.. కనీసం ముగ్గురు నలుగురు 'అపన'లో పనిచేస్తున్నారేమో అనుకున్నాను. కాదని తెలిశాక, చాలా ఇంప్రెస్ అయాను. ఆయనది 'పత్రికా' ప్రపంచం అనిపించింది. దాదాపు గంటన్నర మాట్లాడి సెలవు తీసుకుంటున్నప్పుడు మరో సర్‌ప్రైజ్. మర్నాడు మధ్యాహ్నం వాళ్ళింట్లో 'లంచ్'కు రమ్మని ఆహ్వానం, నా మిత్రుడితో సహా చాలా మొహమాట పడ్డాను. అవాయిడ్ చెయ్యడానికి ప్రయత్నించాను కాని ని, సం హౌవ్ నన్ను ప్రెజర్ చేసి ఒప్పించారు.

సో, ఆ మర్నాడు మధ్యాహ్నం వాళ్ళ ఇంట్లో లంచ్‌కి వెళ్ళాను. డైనింగ్ టేబుల్ మీద అన్నీ ముందుగానే సిద్దం చేసి ఉన్నాయి, విస్కీ బాటిల్‌తో సహా. టిపికల్ తెలంగాణా కల్చర్ అనిపించింది. తీరిగ్గా భోంచేశాము.. అయితే ఇంటివాళ్ళు ఎవరూ ఆ గదిలోకి రాలేదు. ఎవరినైనా పిలిచి పరిచయం చేసే ప్రయత్నం కూడా ఆయన చేయలేదు. అఫ్‌కోర్స్ ఆ విషయం నేను పెద్దగా పట్టించుకోలేదు.. అలాంటివి ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు కూడా. అయితే అది డెఫినెట్‌గా బిజినెస్ లంచ్ కాదు. ఒక సక్సెస్‌ఫుల్ మాగ్‌జైన్ ఎడిటర్ లంచ్‌కి పిలిచి నన్ను కల్టివేట్ చెయ్యవలసినంత స్థాయికాదు నాది, రచయితగా. కాని అప్పటికే నేను ఏ.సి కాలేజ్ గుంటూరులో లెక్చరర్‌గా పనిచేస్తూవుండడం, ఇతర విషయాలు వగైరా ఆయన్ని prompt చేసి ఉండవచ్చు. అప్పటికి విజయవాడలోని నా రచయితల ఫ్రెండ్స్ సర్కిల్ నుండి నలుగురైదుగురు అపన ఆఫీస్ విజిట్ చేయడం జరిగింది. రాజశేఖర్ పాండే, రమణశ్రీ, మాస్టర్జీ, పెందుర్తి, శ్రీ రాజ్, విద్యాసాగర్ వగైరాలు. తర్వాత నేను సీక్రెట్‌గా ఎంక్వైరీ చేసి, వాళ్ళెవరినీ లంచ్/డిన్నర్ కు ఆహ్వానించలేదనీ, ఫార్మల్ గా కాఫీ టీ ఆఫర్ చేసి కాసేపు మాట్లాడి పంపారని తెలుసుకున్నాను. ఇదంతా ఆయన మీద నాకు ఒక పాజిటివ్ ఇంప్రెషన్ కలుగజేసింది.

ఆ తర్వాత అప్పుడప్పుడు హైదరాబాద్ ఏదైనా పనిమీద వెళ్ళినప్పుడల్లా, సమయం ఉంటే కలుసుకునేవాణ్ణి.. ఎప్పూడూ అదే కర్టెసీ, అదే స్నేహభావం కనబరిచేవారు. అయితే 'అపన' సర్క్యులేషన్ బాగా పెరిగి ఆదాయం, పాపులారిటీ పీక్ అయిన సమయంలో ఆయనలో కొన్ని బలహీనతలు కూడా గమనించాను. పొగడ్తలకు ఆనందపడటం, అపన రచయితల్లో కొందరు పనిగట్టుకుని ఆయన దగ్గరకు వెళ్ళిచెప్పే చాడీలు విని అవి నిజమని నమ్మడం, తన దగ్గరకు వచ్చే ప్రతిపాఠకుడి నుండి, ప్రతిరచయితనుండి పొగడ్తలు ఎక్స్‌పెక్ట్ చేయడం ప్రస్ఫుటంగా కనబడేవి. బయట ప్రపంచంలోని వ్యక్తులతో అట్టే సంబంధాలు లేకుండా కేవలం తన పత్రికతో ఏదో రకంగా కనెక్షన్ ఉన్నవారితో మాత్రమే సంభాషించడం వలన డెవలప్ అయిన కాంప్లెక్స్ అనుకుంటాను. ఈ చాడీలు వినే వ్యవహారం ఎంతవరకూ వచ్చిందంటే, ఫాక్ట్స్ వెరిఫై చేసుకోకుండా కేవలం చెప్పుడు మాటలు విని కొందరు చిన్న రచయితల్ని ఆయన బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వరకూ.. (అంటే వాళ్ళు పంపిన కథలు రెండురోజుల్లో తిరుగుటపాలో వచ్చేయడం - కథలో లోపం లేకపోయినా..) అప్పట్లో 'సమైక్య రచయితల సంఘం' (సరసం) అనే రచయితల సంఘంలో నేను యాక్టివ్ మెంబర్‌గా ఉండడం వలన ఇలాంటి విషయాలు చాలా తెలుస్తుండేవి. ఈ చాడీకోరులలో అగ్రతాంబూలం విజయవాడకు చెందిన ఒక రచయిత్రికి దక్కుతుంది. ఆవిడ విజయవాడనుండి ఆ రోజుల్లో ట్రంక్‌కాల్స్ చేసి మరీ గంటల తరబడి సాటి అపన రచయితల మీద కట్టుకథలు చెపుతుండేదని చెప్పేవారు. ఆ తర్వాత

కొంతకాలానికి ఈ చాడీలకు రివార్డ్‌గా వారి 'చెత్తకథలు' అపనలో ప్రత్యక్షమవడం ప్రారంభమయింది. ఆయనలో అస్సలు నచ్చని పార్శ్వం ఇది.

ఇక మరొక సాధారణ కంప్లైయింట్.. ఆయన గురించి ఏమిటంటే, 'అపన'కు వ్రాసే రచయిత లెవరూ ఇతర పత్రికలకు వ్రాయడం ఇష్టముండదని. అపన ఎంకరేజ్‌మెంట్ తో ఎదిగిన రచయితలు ఫస్ట్ ప్రయారటీ అపనకే ఇవ్వాలని.. కొద్దిగా డైరక్టోరియల్ టెండెన్సీ. ఇన్నేళ్ళ తర్వాత అప్పటి పాత పనికిమాలిన విషయాలు నిరూపించమంటే, ఋజువు లేమీ ఉండవుగానీ, ఒక మంచి వ్యక్తి, ఒక మంచి సంపాదకుడు.. సక్సెస్ సరిగా హేండిల్ చేయలేకపోతే స్వార్థపరులు ఎలా విజృంభిస్తారో, చివరికి ఆ ప్రభావం సంస్థమీద/పత్రిక మీద ఎలా పడుతుందో ఈ సంఘటనలు ఋజువు చేస్తాయి.

ఇక కథలకు ఇచ్చే రెమ్యూనరేషన్ విషయంలో ఎవరికీ అంతు చిక్కని ఒక అన్‌డిక్లేర్డ్ గ్రేడింగ్ పాటించేవాడాయన. 25/- , 30/- , 35/-, ఇవి నాకు తెలిసిన రెమ్యూనరేషన్ గ్రేడ్స్. మీకు, మరికొందరికి ఇంకాస్త ఎక్కువ ఇచ్చేవారని కొందరు అనుకునేవాళ్ళు.. నిజం మీకే తెలియాలి. కాని. ఒక సందర్భంలో మాత్రం మీరు ఎక్కువ రెమ్యునరేషన్ డిమాండ్ చేయడం వలన మీ కథలు తీసుకోవడం లేదని నాతోనే అన్నారు. అప్పటికే మీరు ఇతర పత్రికల్లో ముమ్మరంగా వ్రాస్తూ ఉండడం వలన, కంపేరిటివ్‌గా 'అపన' రెమ్యూనరేషన్ తక్కువని మీరే కథలు పంపడం మానేసి ఉంటారని అనుకున్నాను. అలాగే సప్లిమెంట్‌లో మీ నవల అచ్చయిన ప్రతిసారీ మీ నవలనే నూట పదహారు రూపాయలు బహుమతి నవలగా ఎంపిక చెయ్యాలని డిమాండ్ చేసేవారని మీ గురించి ఆయన చెప్పిన మరో కంప్లయింట్. నిజమేదో మీరు చెప్పాలి. ఇంకో సందర్భంలో మీ 'రేపటి కొడుకు' నవలను ఆయన సినిమాగా తీయడానికి మీతో ఒప్పందం అయిన తరువాత, మీరు ఏమో పేచీలు పెట్టి విసిగించారనీ, అందుచేత ఆ ప్రయత్నం మానుకున్నాననీ చెప్పారు. అయితే అమౌంటు ఎంతో గుర్తులేదు కాని, మీకు ఇచ్చిన ఆఫర్ చాలా తక్కువని మాత్రం నాకనిపించింది. ఆ మాటలు చెపితే ఆయన అంగీకరించరు గనుక నేను ఏమీ కామెంట్ చెయ్యలేదు. తమ తమ కెరీర్ ప్రారంభంలో అపనలో రచనలు చేసిన వాళ్ళందరూ తను పెట్టిన భిక్షతో పైకి వచ్చిన వాళ్ళు అనే అభిప్రాయం ఆయనలో అప్పటికే బలంగా ఏర్పడి వుండడం నేను గమనించడం నా మౌనానికి ఒక కారణం.

రచయితలకు ఇచ్చే రెమ్యూనరేషన్ విషయంలో మాత్రం రెడ్డిగారు చాలా పిసినారితనంగా వ్యవహరించేవారనిపించేది. క్రొత్త రచయితలు కొద్ది పారితోషకంతో సంతోషించినా, దశాబ్దాలుగా డజన్ల కొద్దీ మంచి కథలు వ్రాస్తూ, మంచి పాఠకుల ఫాలోయింగ్ ఉన్న విషయంలో కూడా తేడా చూపకపోవడం చివరికి పత్రిక మనుగడకే ముప్పు తెచ్చిందని నా అభిప్రాయం. తీరిక దొరికినప్పుడు ఒకటీ, ఆరా మంచి కథలు వ్రాసి పాఠకుల్లో గుర్తింపు తెచ్చుకుని ఆనందపడే తరం నుండి, వ్రాసే కథలకు పాపులారిటీతో పాటు మంచి పారితోషికం ఆశించే కమర్షియల్ దృక్పథం అలవడిన రచయితల తరం ప్రారంభమవడంతో, ఆయన పాతకాలపు రెమ్యునరేషన్ సిస్టం నెగిటివ్ రిజల్ట్స్‌నే ఇచ్చిందని చెప్పాలి.

మంచి డిటెక్టివ్ కథలు వ్రాయడంలో టాలెంట్ ఉన్నవారు కూడా అపన కన్నా రెట్టింపు రెమ్యునరేషన్ ఇస్తున్న వార, మాస పత్రికలు తమ అవుట్‌పుట్ మళ్ళించడం ప్రారంభించారు. ఆ పత్రికలకు తగిన విధంగా వ్రాయడం అలవాటు చేసుకున్నారు. క్రమక్రమంగా 1980 తర్వాత అపన సర్క్యులేషన్ తగ్గిపోవడం ప్రారంభమయింది. 1972 - 77 మధ్య అపనలో కథలు వ్రాసిన వారిలో చాలా కొద్దిమంది మాత్రం అప్పుడప్పుడు కథలు పంపుతున్నారు. క్రమేణా కథల్లో స్థాయి కూడా క్షీణించడం స్పష్టంగా కనబడేది. 1979 - 80 సంవత్సరాల్లో కాలేజీ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు అప్పచెప్పడండం వలన ఆ రెండేళ్ళలో రెడ్డిగారిని కలిసే అవకాశం కూడా రాలేదు, హైదరాబాద్ వెళ్ళినా సమయం దొరకలేదు. ఆ సమయంలో మొదటిసారిగా ఆయన నుండి రెమ్యునరేషన్‌లు పెంచామనీ, వీలుచేసుకుని కనీసం నెలకు ఒక కథయినా వ్రాసి పంపమని ఉత్తరం వచ్చింది. వెంటనే ఒక కథ వ్రాసి పంపాను. రెమ్యునరేషన్ గురించి కాదు. అపన కూడా గతంలోని డిటెక్టివ్ పత్రికల్లా కాలగర్భంలో కలిసిపోకుండా నా వంతు కృషి చేయాలనిపించి. అయితే పత్రికలో క్వాలిటీ

తగ్గిపోయిందనే విషయం ఆయన ఆలశ్యంగా గ్రహించారు. ఆ నెలకయితే కథ వ్రాసి పంపాను కాని వృత్తిరీత్యా ఉన్న పనివత్తిడివల్ల, రాయాలని ఉన్నా నెలనెలా కథలు పంపడం మాత్రం కుదరలేదు. మిత్రులు రమణశ్రీ, ముద్దా సురేష్, మాస్టర్జీ, శ్రీరాజ్‌లకు కూడా ఇలానే ఉత్తరాలు వ్రాశారని తెలిసింది. అందరి రెస్పాన్స్ దాదాపు నాలాంటిదే కథల క్వాలిటీ తగ్గడంతో బాటు, పత్రిక వెలకూడా ఎబ్‌నార్‌మల్‌గా పెంచడం కూడా అపస డౌన్ ఫాల్ కి ఒక కారణం. మారుతోన్న కాలానికి తగినట్లుగా తన ఎడిటోరియల్ పాలసీని, మాగ్‌జైన్ కంటెంట్‌ని మార్చుకోలేకపోవడం వలన 'లెజండ్రీ ఎడిటర్' స్థాయి అందుకోవలసిన వ్యక్తి, కేవలం ఒక 'టాలెంటెడ్ ఎడిటర్' గా మాత్రమే మిగిలిపోయారని నా అభిప్రాయం.

డిటెక్టివ్ సాహిత్యానికి ఉన్నా 'చౌకబారు సాహిత్యం' అనే టాగ్‌ను సక్సెస్ ఫుల్‌గా తొలగించి డిటెక్టివ్ సాహిత్యానికి, డిటెక్టివ్ కథా రచయితలకి తెలుగు సాహిత్యంలో కొంత రెస్పెక్టబిలిటీ తెచ్చిన ఘనత నిస్సందేహంగా 'అపస'ను, దాని ఎడిటర్ శ్యామ దామోదర రెడ్డిగారికి చెందుతుంది. 1970 - 80 దశాబ్దంలో 'అపస' కున్న మార్కెట్‌బిలిటిని మరో దశాబ్దం సస్‌టెయిన్ చేయిగలిగివుంటే ఆయన డెఫినెట్‌గా లెజెండ్ అయివుండేవాడు. కాని, చిన్న చిన్న పర్సనల్ వీక్నెసెస్, క్రూషియల్ బిజినెస్ డెసిషన్ మేకింగ్‌ను ఇన్‌ఫ్లూయన్స్ చెయ్యడం కంట్రోల్ చేయలేకపోవడం వలన ఆయనకా అవకాశం లేకుండా పోయింది.

అప్పట్లో అపసలో కథలు వ్రాసి మంచి పేరు తెచ్చుకున్న వాళ్ళలో నాకు వ్యక్తిగతంగా పరిచయం ఉన్న వారు - గిరిజశ్రీ భగవాన్, మాస్టర్ పెందుర్తి, ముద్దా సురేష్, రమణశ్రీ, శ్రీరాజ్, రంకి రెడ్డి రాము, చంద్రశేఖర్ అజాద్, శ్రీమతి కురుమద్దాలి విజయలక్ష్మి, విపంచి, విద్యాసాగర్. అలాగే అపస ఆగిపోయేదశకి ముందు కొద్ది సంవత్సరాలు నెలకు రెండు మూడు కథలు వ్రాసిన రచయితలు 'వసుంధర', ప్రతాప రవిశంకర్, మరో రచయిత వగైరాలు ఇంకా ఆక్టివ్ గానే ఉన్నారు గాని వారితో నాకు పరిచయం లేదు.

1983 తర్వాత రెడ్డిగారిని ఎప్పుడూ కలిసిన గుర్తులేదు. ప్రత్యేకమైన కారణం ఏమీలేదు. కలుసుకోవడానికి అవకాశం, సమయం దొరకకపోవడమే కారణం.